దాహార్తి తీరేదెలా.?

- అల్లాడుతున్న మూగజీవాలు
- కానరాని నీటి తొట్టీలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఉపాధిహామీ ద్వారా నీరు అందించాలంటున్న కాపరులు



అటవీ శాఖ ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ బోరు



నిరుపయోగంగా నీటి తొట్టి

వీర్నపల్లి: వేసవి ప్రారంభంలోనే ఉష్ణ తాపానికి మూగజీవాలు అల్లాడుతున్నాయి. ఈ కాలంలోనే ఎక్కువగా అడవి జంతువులు ఎండ తాకిడికి తట్టుకోలేక కన్నుమూస్తాయి. కొన్ని జంతువులు దాహార్తి తీర్చుకునేందుకు అడవిని వీడి ఊళ్లలోకి వచ్చి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

వీర్నపల్లి మండలంలోని 17 గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. వాగులు, కుంటలు ఎండిపోయాయి. మూగజీవాల పరిస్థితి దారుణంగా మారింది. ముందు జాగ్రత్తగా జీవాల కొరకు నూతన నీటి తొట్టీల ఏర్పాటు, నిరుపయోగంగా ఉన్న పాత నీటి తొట్టీలకు మరమ్మతు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. వీటి దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం గ్రామాల్లో తొట్టీల నిర్మాణ బాధ్యతను స్థానిక సంస్థలకు అప్పగించింది. అయితే సదరు ప్రజాప్రతినిధులు ఇష్టానుసారంగా నిర్మించి చేతులు దులుపుకున్నారు. నీటి సౌకర్యం లేనిచోట కూడా తొట్టీలు నిర్మించడంతో అవి కాస్తా నిరుపయోగంగా మారాయి.

నిధులు మంజూరు

వేసవికాలం పశువుల దాహార్తిని తీర్చేందుకు ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మండలంలో ఉన్న 17 గ్రామాలకు 2019లో 12 నీటి తొట్టీలు మంజూరు చేశారు, ఒక్కొక్క నీటి తొట్టి రూ.18 వేలతో నిర్మించారు. తొట్టీలో నీరు పోసే బాధ్యత గ్రామపంచాయతీ చూసుకోవాల్సి ఉంటుంది. అటవీ శాఖ అధికారులు మండలంలోని మద్దిమల్ల గ్రామంలో బోడగుట్టలో విద్యుత్ సరఫరా అందుబాటులో లేనందున మూడు సోలార్ విద్యుత్ బోర్లు, రంగంపేట గ్రామంలో లొద్దిల ఒర్రె గడ్డ దగ్గర ఒక బోరు వేశారు. ఇవి కూడా భూగర్భ జలాలు అడుగంటడంతో రెవెన్యూ ప్లాంటేషన్‌లో పెట్టిన మొక్కలకు, అడవి జంతువులకు కొంతవరకు ఉపయోగపడుతున్నాయి. మండల వ్యాప్తంగా అడవి జంతువులు 5 వేలకు పైగా ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు తెలుపగా, పశుసంవర్థక శాఖ లెక్కల ప్రకారం ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు మొత్తం కలిపి సుమారు 50 వేలకు పైన ఉన్నాయి. వీటికి వేసవిలో నీటి సదుపాయం కల్పించాలంటే గ్రామాల్లో ఉండే నీటి తొట్టీలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

తిప్పలయితంది



మాకు గొర్రెలు, మేకలు, బర్రెలు ఉన్నాయి. పశువుల తొట్టీలు లేక మూగజీవులకు దాహం తీర్చేందుకు ఇబ్బందవుతోంది. మండలంలోని చాలా గ్రామాల్లో పశువుల తొట్టీలు లేక అవస్థలు పడుతున్నాం. జీవాల దాహం తీర్చేందుకు కిలోమీటర్ల మేర నడవాల్సి వస్తోంది.
– నక్క భూమయ్య, గొర్రెల కాపరి

బాధ్యత పంచాయతీలదే



పశువుల తొట్టీలు లేకపోవడం వాస్తవమే. గతంలో 12 నీటి తొట్టీలు మంజూరు చేశాం. ఇంకా నీటి తొట్టీలు కావాలంటే గ్రామ పంచాయితీ తీర్మానం కాపీ ఇస్తే నిర్మించి ఇస్తాం. వాటిని కాపాడాల్సిన బాధ్యత మాత్రం గ్రామ పంచాయతీ పాలకవర్గానిదే.
– శ్రీహరి, ఇన్‌చార్జ్ ఏపీవో

నిర్లక్ష్యమెందుకు.?

నీటి తొట్టీలను వినియోగంలోకి తేవాల్సి ఉన్నా పశుసంవర్ధక, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నీటి తొట్టీలకు మిషన్ భగీరథ పైపులైన్ లేనిచోట బోరు ఏర్పాటుతోపాటు విద్యుత్ కనెక్షన్ కల్పించడంలో దృష్టి సారించడం లేదు. వాగులు ఎండుతున్న దృష్ట్యా రానున్న రెండు నెలల్లో ఈ తీవ్రత మరింత పెరిగి మూగజీవాలకు ముప్పు తిప్పలు తప్పవని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

క్షయ వ్యాధి నివారణకు సహకరించాలి



క్షయవ్యాధి పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డిపేట: క్షయ వ్యాధి నివారణకు అందరు సహకరించాలని వైద్యాధికారి స్రవంతి, పర్యవేక్షకులు నాగరాజు అన్నారు. మండలంలోని దుమాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం క్షయవ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం రవీందర్, ఏఎన్ఎం శ్యామల, ఆశ కార్యకర్త సునీత, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవాలు ప్రారంభం



ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం అంగన్‌వాడీ టీచర్లు పోషణ ప్రతిజ్ఞ నిర్వహించారు. పౌష్టికాహారం ప్రాధాన్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. చిన్నారుల తల్లిదండ్రులకు చిరుధాన్యాల మిల్లెట్స్‌ను అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంజుల, భాగ్యమ్మ, ప్రశాంతి, మమత, కృష్ణవేణి పాల్గొన్నారు.

పుట్టల మల్లన్న కల్యాణం



నిమ్మపల్లి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కోనరావుపేట: మండలం నిమ్మపల్లి శివారులోని పుట్టల మల్లన్న కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పట్నాలు వేసి పుట్టల మల్లన్న, కేతమ్మ, మేడలమ్మ, ఎల్లమ్మ–మునిరాజు కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కదిరె శ్రీనివాస్, కెంద గంగాధర్, ఆలయ కమిటీ చైర్మన్ చెకుట మహేశ్, బాధ్యులు పబ్బ అంజయ్య, మానుక సత్యం, శేఖర్, ఎక్కల్‌దేవి కొమురయ్య, నిమ్మపల్లి, బావుసాయిపేట, వట్టిమల్ల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

హంస వాహనంపై స్వామివారు



వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో జరుగుతున్న శ్రీరామ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులను హంస వాహనంపై ఊరేగించారు. వాతావరణం సరిగా లేకపోవడంతో ఊరేగింపును రద్దు చేసి కేవలం ఆలయంలోనే ప్రదక్షిణలు నిర్వహించారు.

విప్లవ వీరులకు వందనం



సిరిసిల్లటౌన్/కోనరావుపేట/తంగళ్లపల్లి/బోయినపల్లి: స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన విప్లవవీరులు సాహిద్ భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ, ఎంసీపీఐ (యూ), సీపీఐ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



సిరిసిల్లలో..



చందుర్తిలో..

సిరిసిల్లటౌన్/గంభీరావుపేట/రుద్రంగి/చందుర్తి:: ప్రధాని మోడీపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై పెట్టిన కేసులో సూరత్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించడంపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. సిరిసిల్లలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ అధ్యక్షురాలు కాముని వనిత, బ్లాక్ అధ్యక్షుడు సూర దేవరాజు, చొప్పదండి ప్రకాశ్, సంగీతం శ్రీనివాస్, గంభీరావుపేటలో మండల శాఖ అధ్యక్షుడు హమీద్, ఎంపీటీసీ పర్శరాములు, రుద్రంగిలో డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి, చందుర్తిలో మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి గొట్టే ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడులు బాలకృష్టారెడ్డి, మీడియా కోఆర్డినేటర్ మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

నియామకం

పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడిగా బాలకిషన్

ముస్తాబాద్: పట్టణ పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడిగా తడుక బాలకిషన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మార్కండేయ భవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గౌడ మల్లేశం, ఎనగందుల దశరథం, ప్రధాన కార్యదర్శులుగా దొంత బాలరాజు, బిట్ల దేవానందం, కోశాధికారిగా గౌడ కృష్ణహరి, చిట్టి ఇన్‌చార్జిగా శ్రీరాం మనోహర్ ఎన్నికయ్యారు.

ఆధ్యాత్మికం

శతచండీ మహాయాగం



గంభీరావుపేట: జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి 73వ వర్ధంతి సందర్భంగా లింగన్నపేట హరిహర ఆలయంలో శ్రీశతచండీ మహా యాగ ఉత్సవాలు నిర్వహించారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



రుద్రంగి: రుద్రంగిలోని మడేలేశ్వరుని ఉత్సవాల్లో భాగంగా రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మకు బోనాలు తీశారు.

నేటి నుంచి బహ్మోత్సవాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 24 నుంచి 26 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శివరామకృష్ణ, తెలిపారు.

కౌన్సిలర్లకు సన్మానం



కౌన్సిలర్లను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: నూరు శాతం పన్నులు వసూలు చేసిన సిరిసిల్ల కౌన్సిలర్లను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ సన్మానం చేశారు. 18, 19, 25, 33, 34, 37 వార్డు కౌన్సిలర్లు గడ్డం చందన, అన్నారం శ్రీనివాస్, కుడిక్యాల రవికుమార్, గడ్డం లత, దార్ల కీర్తన, దిడ్డి మాధవిని సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, మేనేజర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



బీమా చెక్కును అందిస్తున్న నాయకులు

ముస్తాబాద్: ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందిన మండలంలోని గూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కస్తూరి రవి కుటుంబానికి రూ.2 లక్షల విలువ చేసే ప్రమాద బీమా చెక్కును బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు గురువారం అందజేశారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆర్‌బీఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, ఉపసర్పంచ్ శాడ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీధర్ పాల్గొన్నారు.

సింగిల్‌విండో సమావేశం

తంగళ్లపల్లి: సిరిసిల్ల సింగిల్ విండో సర్వసభ్య సమావేశం గురువారం చైర్మన్ బండి దేవదాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సింగిల్ విండో ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను, వెచ్చించిన మొత్తాన్ని సీఈవో నరేశ్ వివరించారు. అనంతరం చైర్మన్ దేవదాస్ మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కొరకు పాటుపడుతుందని తెలిపారు. కలిసికట్టుగా శ్రమించి మెరుగైన అభివృద్ధిని సాధిద్దామన్నారు. వైస్‌చైర్మన్ వెంకటరమణారెడ్డి, వైస్ ఎంపీపీ జంగిటి అంజయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు దేవేందర్‌యాదవ్, భాస్కర్ యాదవ్, ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- జూనియర్ సివిల్ జడ్జి ప్రతీక్ సీహగ్



మాట్లాడుతున్న జడ్జి ప్రతీక్ సీహగ్

వేములవాడఅర్బన్: వేములవాడలోని జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి ప్రతీక్ సీహగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చట్టాలపై కనీస అవగాహన ఉండాలన్నారు. విద్యార్థి దశలోనే చట్టాలను తెలుసుకోవాలన్నారు. నిరుపేదలకు ఉచిత న్యాయసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలోబార్ అసోసియేషన్ అధ్యక్షుడు వే ముల సుధాకర్, ఉపాధ్యక్షుడు గడ్డం సత్యనారా యణరెడ్డి, సీనియర్ న్యాయవాదులు తిరుమలగౌడ్,అనిల్‌కుమార్, నర్సింగారావు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- సిరిసిల్ల డీఎస్పీ విశ్వప్రసాద్



మాట్లాడుతున్న డీఎస్పీ విశ్వప్రసాద్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రంజాన్ మాసాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సిరిసిల్ల డీఎస్పీ విశ్వప్రసాద్ కోరారు. ఎల్లారెడ్డిపేట ఠాణాలో గురువారం ముస్లింలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పండుగలు.. మన జీవనస్రవంతిలో భాగమయ్యాయన్నారు. పండుగలు మతానికి సంబంధించినవి అయినప్పటికీ.. ప్రతీ పండుగలో ఓ సందేశం ఉంటుందన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్‌ను నిర్వహించుకోవాలని డీఎస్పీ కోరారు. ఎస్సై శేఖర్, మైనార్టీ నాయకులు గౌస్, యాకుబ్, పోలీస్ సిబ్బంది, పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ: పట్టణంలోని 4వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కౌన్సిలర్ మారం కుమార్, వార్డుప్రజలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ గున్నాల అరుణ గురువారం ప్రారంభించారు. సర్పంచ్ గున్నాల అరుణ, వార్డు సభ్యులు తీగల వెంకన్న, బత్తుల రేఖ, కార్యదర్శి అభిలాష్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు అరెస్టు

ఇల్లంతకుంట: సీఎం కేసీఆర్ కరీంనగర్ జిల్లా పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మండలానికి చెందిన వీరేశం, జమాల్, ప్రసాద్, నరేందర్‌రెడ్డి, నరేష్, రమణారెడ్డి, సంతోష్‌బాబు, బాబు, సుగుణాకర్ రెడ్డి, మల్లేశం, మల్లయ్య, రాజు అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

ఐలమ్మ ఆశయ సాధనకు కృషిచేయాలి



విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు

బోయినపల్లి: చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుంటి సురేందర్ రెడ్డి, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని విలాసాగర్‌లో చాకలి ఐలమ్మ సాధన సమితి అధ్యక్షురాలు కొత్తకొండ లక్ష్మి, రజకసంఘం నాయకులతో కలిసి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రజకులు చదువులో రాణించాలన్నారు. కొత్తకొండ లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం రజకుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. మొదట రజకసంఘం కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. సర్పంచ్ జూలపల్లి స్వప్నాంజలి, వైస్ఎంపీపీ నాగయ్య, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, ఏనుగుల కనుకయ్య, రజకసంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు కొమురయ్య, పర్శరాములు, దుబ్బాక రమేశ్, అక్కరాజు శ్రీనివాస్, పైండ్ల చందు, మండల అధ్యక్షుడు ర్యాగల్ల అంజయ్య, గంగిపెల్లి ప్రేమ్ సాగర్, రమేశ్, పైండ్ల మహేశ్, సంపత్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌రహిత పల్లెలను నిర్మిద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ జనగామ శరత్‌రావు

ముస్తాబాద్: ప్లాస్టిక్ రహిత స్వచ్ఛమైన పల్లెలను నిర్మిద్దామని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏలు గ్రామాల్లో బాధ్యతయుతంగా పనిచేయాలన్నారు. హోటళ్లు, ఫంక్షన్ హాల్స్, దుకాణాల్లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం, అమ్మకాలను అరికట్టాలన్నారు. హరితహారంలో మొక్కల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిక్షణ అనంతరం ఆదర్శ మండలంగా సంపూర్ణ పారిశుధ్య, నూరు శాతం ఓడీఎఫ్ గ్రామాలుగా నమోదు కావాలన్నారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, ఎంపీడీవో రమాదేవి, ఎంపీవోలు అరిఫ్, ప్రదీప్, ఎస్ఎస్‌జీ ఇన్‌చార్జి సురేశ్, జిల్లా శిక్షణ మేనేజర్ సంతోష్, సర్పంచులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు వ్యవసాయ, రెవెన్యూ శాఖ దెబ్బతిన్న పంటలను సర్వే చేస్తున్నాయన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు జరుగుతున్న నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలన్నారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ నరేశ్, ఏవో వెంకటేశ్, ఏఈవో శ్రీలత పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 16 గొర్రెలు మృత్యువాత

కోనరావుపేట: కుక్కల దాడిలో 16 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బావుసాయిపేటకు చెందిన ఎక్కల్‌దేవి పర్వతాలు రోజులాగే ఇంటివద్ద ఉన్న దొడ్డిలో గొర్రెలను తోలాడు. గురువారం వీధికుక్కలు ఒక్కసారిగా దాడిచేయడంతో పర్వతాలుకు చెందిన 15 గొర్లు, ఊరడి తిరుపతికి చెందిన ఒక గొర్రె మృతిచెందింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

అన్నదాతలు అధైర్యపడొద్దు

ముస్తాబాద్: వడగండ్ల వానతో ప్రకృతి వైపరీత్యంతో నష్టపోయిన అన్నదాతలు అధైర్యపడొద్దని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు అన్నారు. గోపాల్‌పల్లె, చిప్పలపల్లి, నామాపూర్‌లో వడగండ్ల వానతో దెబ్బతిన్న వరి పంటలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు.

సూపరింటెండెంట్ బదిలీ

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో సూపరింటెండెంట్ లక్ష్మణ్‌రావు డెప్యూటేషన్‌పై కొండగట్టుకు బదిలీ చేస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఆంజనేయ స్వామి వారి ఉత్సవాలు ఉన్నందున డెప్యూటేషన్ చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

చెక్కులు పంపిణీ

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని 22, 24 వార్డుల్లో గురువారం లబ్దిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను కౌన్సిలర్లు బుర్ర లక్ష్మి, కల్లూరి లత పంపిణీ చేశారు. రాచర్ల కావ్య, సోమ సౌమ్య, గాలి భువన, వేముల స్వాతి, మెరుగు వాణిలకు కల్యాణ లక్ష్మి చెక్కులను, గూడూరి నరేశ్, రేణుక, స్వప్న, కొంపెల్లి శంకర్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో 10 మంది లబ్దిదారులకు ఎంపీపీ పడిగెల మానస సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ

రుద్రంగి: మండలంలోని రూప్లానాయక్ తండా నుంచి జోత్య నాయక్ తండా వరకు నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ తిరుపతి గురువారం భూమిపూజ చేశారు.

పౌరహక్కులకు భంగం

కోనరావుపేట: అధికార పార్టీ నాయకులు పౌరల హక్కులను కాలరాస్తున్నారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా అన్నారు. తీన్మార్ మల్లన్నపై అరెస్ట్ చేయడం సరైంది కాదన్నారు. చందనగిరి గోపాల్, వంగపెల్లి శోభన్ పాల్గొన్నారు.